క్లుప్తంగా

ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమికస్థాయిలో విద్యార్థుల్లోతెలుగు,ఇంగ్లిష్ గణితం విషయంలో సామర్థ్యంపెంపొందించేందుకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోర్సు డైరెక్టర్ కె.మధుకర్ తెలిపారు. హెచ్ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బ్రిడ్జి పనుల పరిశీలన



అధికారులతో బ్రిడ్జిని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

రుద్రంగి: ఇటీవల కురిసన భారీ వర్షాలకు ధ్వంసమైన దసరా నాయక్ తండాకు వెళ్లే దారిలోని లోలెవెల్ వంతెన, రోడ్డు నిర్మాణానికి వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు రూ.కోటి నిధులు మంజూరు చేశారు. దీంతో శనివారం రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య అధికారులు, నాయకులతో కలిసి ధ్వంసమైన బ్రిడ్జి, రోడ్డును పరిశీలించారు. త్వరగా పనులు ప్రారంభించాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేశ్ బాబుకు దసరానాయక్ తండా, రుద్రంగి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్ఏఈ మ నోహర్, నాయకులు దయ్యాల కమలాకర్, ఇంజినీర్‌లు, దసరా నాయక్, రుద్రంగి గ్రామస్తులు ఉన్నారు.

జోరందుకున్న హరితహారం



మల్లారంలో మొక్కలు నాటుతున్న కూలీలు

వేములవాడరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో హరితహారం పనులు జోరందుకున్నాయి. 17 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటుచేసిన 1.70 లక్షల మొక్కలను పెంచగా అందులో 32 వేల మొక్కలను రూరల్ మండలంలో పెంచాలనే అధికారుల ఆదేశాలతో ఇప్పటికీ దాదాపు 20వేలకు పైగా మొక్కలు గ్రామాల్లో నాటినట్లు ఏపీవో చంద్రయ్య తెలిపారు. మిగితా 12వేల మొక్కలను త్వరలో నాటుతున్నట్లు తెలిపారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సుభాష్‌చందర్

వేములవాడ: వ్యవసాయ పనిముట్లతో పాటు సైన్స్ అగ్రికల్చర్ ఎగ్జిబిట్స్‌లపై క్రియేటీవ్ మైండ్ ఏజీఎం సుభాష్‌చందర్ శనివారం విద్యార్థుల కు అవగాహన కల్పించారు. కిడ్స్ కాన్వెంట్ స్కూల్లో పల్లెసృజన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యవసాయంలో ఇన్నోవేషన్స్‌పై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో సైన్స్ పాత్రపై వివరించారు. 9వ తరగతి విద్యార్థిని జీ.మోక్షిత ఫ్రూట్ ఫ్లక్కింగ్‌ను తయారుచేసి చూపించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ దరక్షన్ వస్పియా, డైరెక్టర్ ఫసి, టీచర్స్, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని రెవెన్యూ అధికారులు



అధికారులు లేక బోసి పోయిన తహసీల్దార్ కార్యాలయం

బోయినపల్లి: బోయినపల్లి తహసీల్దార్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య మండిపడ్డారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఉదయం 11 గంటలు దాటినా ఉన్నతాధికారులు కార్యాలయానికి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్‌బుక్ చేసుకున్న వారికి సమయం ఇచ్చి అధికారులు సమయానికి రాకపోవడంపై విస్మయం వ్యక్తంచేశారు. సమయ పాలన పాటించని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు కొండయ్య తెలిపారు.

తుప్పపట్టి .. మూలకు..

- గ్రామపంచాయతీల్లో మూలనపడిన ఈ రిక్షాలు, ట్రై సైకిళ్లు
- ట్రాక్టర్ల రాకతో చెత్తసేకరణ సైకిళ్లకు మంగళం
- వాడేందుకు పనికిరాదు, అమ్మేందుకు మనసు రాదు

తంగళ్లపల్లి: చెత్తబండి వచ్చిందమ్మా.. చెత్తను ఇవ్వండమ్మా.. అంటూ గ్రామాల్లో ఉదయం ప్రచారంచేస్తూ విజిల్‌వేసి మరీ పిలిచి చెత్తను సేకరించిన ట్రైసైకిళ్లు ఇప్పుడు కనుమరుగయ్యాయి. ట్రాక్టర్ల రాకతో వాటిని పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీంతో పరికరాలు చెడిపోయి పనిచేయని స్థితిలో తుప్పుతో స్నేహం చేస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణం) తెలంగాణ పేరుతో మూడు చక్రాల చెత్తసేకరణ సైకిళ్లు, ఎలక్ట్రిక్ ఆటోలను సమకూర్చాయి. ఒకప్పుడు వెలుగు వెలిగి గ్రామాలను స్వచ్ఛత పంచేందుకు కృషిచేసిన వాటి పరిస్థితి ప్రస్తుతం పలకరింపుకు ఎక్కువ, చీదరింపుకు తక్కువ అన్నట్లుగా తయారైంది.



తంగళ్లపల్లిలో తుప్పపడుతున్న ట్రై సైకిళ్లు

గతం గణం, ప్రస్తుతం శూన్యం..

గ్రామాల్లో చెత్తసేకరణలో ట్రైసైకిళ్లు, ఎలక్ట్రిక్ ఆటోలు ట్రాక్టర్లు రాకముందు ఎన్నో సేవలు అందించాయి. కొత్త ఒక వింత పాత ఒక రోత అని పెద్దలు సామెత చెప్పినట్లే ప్రస్తుతం వాటిని పట్టించుకోవడం మానేశారు. ఎప్పుడైతే రాష్ట్రప్రభుత్వం ప్రతీ గ్రామపంచాయతీకి ట్రాక్టర్ తప్పనిసరి చేసిందో అప్పటి నుండే ట్రైసైకిళ్లు, ఎకలక్ట్రిక్ ఆటోలకు కాలం చెల్లింది. గతంలో ఏ పెళ్లి భోజనాల్లో చూసినా చెత్త సేకరణకు ట్రైసైకిళ్లను నిలిపి వెళ్లేవారు. తర్వాత ఆ చెత్తను తరలించి రోడ్లను శుభ్రం చేసేవారు. ప్రస్తుతం ఆ పని ట్రాక్టర్ల వంతైంది. వాడుకలో లేకపోవడంతో సామగ్రి, పరికరాలు చెడిపోయి తప్పుపడుతున్నాయి.

బాగుచేయరు, వేలం వేయరు..

తంగళ్లపల్లి మండలంలో 30 గ్రామ పంచాయతీలుండగా అన్ని గ్రామాల్లో కలిపి 48 ట్రైసైకిళ్లు, 20 బ్యాటరీ రిక్షాలున్నాయి. అత్యధికంగా తంగళ్లపల్లి గ్రామపంచాయతీకి 7 ట్రైసైకిళ్లు ఉన్నాయి. ఒక్కో ట్రైసైకిల్‌కు సుమారు రూ.15వేలు, ఒక్కో ఎలక్ట్రిక్ బ్యాటరీ రిక్షాకు రూ.1.50 లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. కాగా ప్రస్తుతం మండలంలో 48 ట్రైసైకిళ్లకు గాను ఒక్కటి కూడా వినియోగంలో లేదు.. 20 బ్యాటరీ రిక్షాల్లో కేవలం తాడూర్ గ్రామ పంచాయతీలో మాత్రమే ఒక్క రిక్షా పనిచేస్తోంది. మిగితా 19 బ్యాటరీ రిక్షాలు వినియోగంలో లేవు. వాటికి మరమ్మతు చేయాలేని స్థితిలో ఉన్నాయి. ప్రస్తుతం గ్రామపంచాయతీలు ట్రాక్టర్లకు నెల వాయిదాలు కట్టలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో ట్రైసైకిళ్లు, బ్యాటరీ రిక్షాలు తలకు మించిన భారంగా మారాయి. పాడైపోయిన వీటిని వేలంవేసి ఆమొత్తాన్ని గ్రామపంచాయతీ ఖాతాలో జమచేస్తే ఏమైనా అభివృద్ధి పనులకు ఉపయోగపడే అవకాశం ఉంది.



వినియోగంలో లేని ఎలక్ట్రిక్ రిక్షా

రెండు ట్రాక్టర్లు ఉన్నాయి



తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీ కావడంతో ప్రస్తుతం రెండు ట్రాక్టర్లతో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నాం. ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చాక ట్రైసైకిళ్లను వినియోగించడం లేదు. అధికారుల సూచనలతో నడుచుకుంటున్నాం.

– అంకారపు అనిత, సర్పంచ్ తంగళ్లపల్లి

ట్రాక్టర్లదే ముఖ్య భూమిక..



ప్రస్తుతం అన్ని గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారానే చెత్త సేకరణ చేస్తున్నారు. దాదాపుగా సైకిళ్లు బ్యాటరీ రిక్షాల వినియోగంలో లేకుండాపోయాయి. ఉన్నత అధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం. పారిశుధ్య కార్మికులు చెత్తసేకరణలో వీటికి అలవాటు పడ్డారు.

– పి.లచ్చాలు, ఎంపీడీవో, తంగళ్లపల్లి

పాడైతే వేలం వేయాలి..



గ్రామపంచాయతీల్లో చెత్తసేకరణకు ఏర్పాటుచేసిన ట్రైసైకిళ్లు, బ్యాటరీ రిక్షాలు పాడైపోతే బాగుచేయాల్సి ఉంటుంది. బాగుచేయలేని పరిస్థితిలో ఉంటే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వేలం వేయాలని ఆదేశించాం. త్వరలో వీటికి సంబంధించి అన్నిరకాల చర్యలు తీసుకుంటాం.

– ఏ.రవీందర్, డీపీవో, సిరిసిల్ల జిల్లా

చీఫ్ జస్టిస్‌ను కలిసిన న్యాయవాదులు



సన్మానిస్తున్న వేములవాడ అడ్వకేట్లు



నవీన్‌రావును కలిసిన సిరిసిల్ల న్యాయవాదులు

సిరిసిల్లటౌన్/వేములవాడ: రిటైర్డ్ జస్టిస్, ఆక్టివ్ సీజే ఐ నవీన్‌రావును సిరిసిల్ల న్యాయవాదులు శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో కోర్టుల పాత్ర చాలా గొప్పదన్నారు. కరీంనగర్ కోర్టు ఆవరణలో నిర్వహించిన అభినందన సభలో వేములవాడకు చెందిన అడ్వకేట్లు పెంట రాజు, నక్క దివాకర్, పిట్ట ల మనోహర్, గుడిసె సదానందం, నరేశ్, అంజ య్య, నయిమానాసరి, అనిల్‌కుమార్, మహేందర్ మనోహర్ హాజరై చీఫ్ జస్టిస్ నవీన్‌రావును ఘనంగా సన్మానించారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి అనిల్, సీనియర్, మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.

కంప్యూటర్ చాంప్స్‌తో విద్యాప్రమాణాల పెంపు



కంప్యూటర్ చాంప్స్‌పై పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: కంప్యూటర్ చాంప్స్‌తో విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత పెంపొంది, విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని హెచ్ఎం గొట్టి ముక్కల శేఖర్ అన్నారు. వెంకటాపూర్‌లోని జెడ్పీపాఠశాలలో శనివారం కంప్యూటర్ చాంప్స్ ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరించారు. శేఖర్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కంప్యూటర్ చాంప్స్ టీచర్ సలాఉద్దీన్, ఇన్విజిలేటర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బహుజన రణభేరి సభకు తరలిరావాలి

బోయినపల్లి: బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ అధికారంలోకి రావడానికి ప్రతీ బహుజనుడు కృషిచేయాలని బీఎస్పీ రాజన్నసిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి బట్టు రామచంద్రం పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలో ఆగస్టు 6న చొప్పదండిలో నిర్వహించే బహుజన రణభేరి విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. జిల్లా నాయకులు ఏనుగుల లింగన్న, మాంకాళి తిరుపతి, మండల అధ్యక్షుడు అలువాల అజయ్, పెగ్గెర్ల మహేందర్, సురేందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రవేశపెట్టిన బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడంతో శనివారం ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకు ఆర్టీసీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

కాంగ్రెస్ సంబరాలు

ముస్తాబాద్: రాహుల్‌గాంధీపై ఎంపీ అనర్హత వేటు శిక్ష రద్దుకావడంపై ముస్తాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. రాజీవ్ చౌక్‌లో టపాసులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెలరాజు, కొండం రాజిరెడ్డి, కొప్పు రమేశ్, శీల ప్రశాంత్, రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, వేముల సత్యం, నర్సింహులు, బాల్‌రెడ్డి, నరేశ్, భానుచందర్, కొమురయ్య పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడి కార్మికుల నిరసన

వీర్నపల్లి: మండలకేంద్రంలో జీపీకార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా 31వ రోజు శనివారం బతుకమ్మ ఆటలు ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు ప్రస్తావన తీసుకువచ్చారని సీఎం కేసీఆర్ తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు సురేశ్, నర్సయ్య, శేకర్, శ్రీనివాస్, మహిళ కార్మికులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చందుర్తి: మండలంలోని పలు గ్రామాల్లో పలువురికి మంజూరైనా సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఆశిరెడ్డిపల్లికి చెందిన ఎర్ర సావిత్రికి రూ.59వేల చెక్కును, ఎన్గల్‌కు చెందిన గుంటి గంగాధర్‌కు రూ.19వేల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్గల్ సర్పంచ్ లింగంపల్లి సత్తయ్య, ఎంపీటీసీ మాదాసు కవిత, ఉపసర్పంచ్ మంజుల , నలుమాచు వెంకటరెడ్డి, బొజ్జ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ట్రస్ట్

బోయినపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కీ.శే. చెన్నాడి మార్తాండరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యం, విద్య అంశాల్లో సాయం చేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ చెన్నాడి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బూర్గుపల్లి, బోయినపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటుబుక్కులు పంపిణీ చేశారు. సర్పంచు లతశ్రీ గుంటి, ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, జే.సంపత్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాజన్న కోడెలు అందజేత

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను శనివారం యాదాద్రి జిల్లా రాజాపేట మండలం చల్లూరుకు చెందిన సహాయోగ్ గోశాలకు 4 కోడెలను శనివారం అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నరసింహామూర్తి, శ్యామ్, శంకర్ ఉన్నారు.

ఇజ్రాయిల్ స్టడీ టూర్‌కు వెళ్లిన నర్సయ్య

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర కోఆపరేటివ్ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతుల అధ్యయనానికి సంబంధించి ఇజ్రాయిల్ దేశంలో నిర్వహించే స్టడీటూర్‌కి రాజన్న సిరిసిల్ల జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య శనివారం వెళ్లారు. ఈనెల 10 తేదీ వరకు ఇజ్రాయిల్ దేశంలో వ్యవసాయ ఆధునిక పద్ధతులపై అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో రైతుబంధు అధ్యక్షులు, హర్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులతో కలిసి వెళ్లారు.

ఆర్డీవోను కలిసిన ప్రజాప్రతినిధులు



ఆర్డీవోను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్డీవో మధుసూదన్‌గౌడ్ ఇటీవల ఉద్యోగ బాధ్యతలు చేపట్టడంతో ఆయనను వేములవాడ అర్బన్ మండల సర్పంచ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఉరడి రాంరెడ్డి, సర్పంచ్‌లు పండుగ ప్రదీప్, కదిరె రాజుకుమార్, రాసూరి రాజేశం, గుర్రం లక్ష్మారెడ్డి, రంగు సత్తెమ్మరాములు, ఇటుకల నవీనరాజు ఉన్నారు.

‘గృహలక్ష్మి’కి దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట/వేములవాడరూరల్/ఇల్లంతకుంట/వేములవాడఅర్బన్/రుద్రంగి/ముస్తాబాద్/బోయినపల్లి: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని అర్హులైన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఇందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇల్లంతకుంటలో ఎంపీడీవో మీర్జా, కోనరావుపేటలో ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య , వేములవాడరూరల్ మండలంలో ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, వేములవాడఅర్బన్ ఎంపీడీవో శ్రీధర్, రుద్రంగి ఎంపీడీవో మాలోతు శంకర్ ఎంపీడీవో, ముస్తాబాద్‌లో ఎంపీడీవో రమాదేవి, బోయినపల్లి ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి కార్యాలయాల్లో సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ పథకానికి అప్లికేషన్ ఫారం పూర్తిచేసి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, స్థలం డాక్యుమెంట్, బ్యాంకు పాస్‌బుక్కు జిరాక్సులను ఈనెల 10వ తేదీలోగా ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలని కోరారు.



రెడ్ కలర్స్ డే..

సిరిసిల్ల: విద్యానగర్‌లోని శ్రీచైతన్య ఈ టెక్నో స్కూల్ లో శనివారం రెడ్ కలర్స్ డే నిర్వహించారు. పిల్లలకు ప్రైమరీ కలర్స్‌పై అవగాహన కల్పించేందుకు రెడ్ కలర్స్ డే ఏర్పాటుచేశామన్నారు. ఆదివారం ఫ్రెండ్ షిప్‌డే సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. తోటి విద్యార్థులతో స్నేహభావం పెంచుకోవాలని, ఆత్మీయంగా ఉండాలని ఉపాధ్యాయులు పిల్లలకు బోధించారు. వేడుకల్లో పాఠశాల రిజినల్ ఇన్‌ఛార్జి రాజు, ప్రిన్సిపాల్ ఆకునూరి వెంకటేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: రెడ్ కలర్స్‌డేను వేములవాడలోని కిడ్స్ కాన్వెంట్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఎరుపు రంగు దుస్తులు ధరించి డ్యాన్స్‌లతో ఎరుపు రంగు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దరక్షన్ వస్పియా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుతారి కార్మికులను ఆదుకోవాలి

ముస్తాబాద్: సుతారి భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తలారి నర్సయ్య కోరారు. ముస్తాబాద్ మండలం సుతారి భవన కార్మికసంఘం 20వ వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికసంఘం జెండాను ఆవిష్కరించారు. నర్సయ్య మాట్లాడుతూ.. అర్హులైన కార్మికులందరికీ ప్రభుత్వం డబుల్‌బెడ్రూంలు ఇవ్వాలని, ప్రమాదబీమా రూ.20లక్షలు చెల్లించాలన్నారు. హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్మికుల పిల్లలకు ఉన్నత విద్యను ఉచితంగా అందించాలన్నారు. 40 ఏళ్లు నిండిని కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని కోరారు. కార్మికులు ఐక్యతతో డిమాండ్లు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు గీస బిక్షపతి, గోకనర్సయ్య, పిల్లిరాజు, ముక్క మల్లయ్య, రాజయ్య, నర్సయ్య, చంద్రయ్య, వెంకటి, శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యత

ముస్తాబాద్: కార్మికుల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లెలో భవన నిర్మాణ, హమాలీ కార్మికులకు ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. అంజిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టితో అన్నివర్గాల కార్మికులను ఆదుకునేందుకు శిబిరాలను ఊరురా ఏర్పాటుచేశారన్నారు. కార్మికులు ఈ అవకాశాన్ని స ద్విని యోగం చేసుకోవాలని కోరారు. వైద్యాధికారి సందీప్, సర్పంచ్ సడిమెల సుజాత, ఉపసర్పంచ్ మెంగని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సడిమెల ఎల్లం, కారద ర్శి ఉష, అజీమ్, దేవయ్య, రమేశ్‌రెడ్డి, రాజం దుర్గయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ముస్తాబాద్: అపరిచిత వ్యక్తులు సెల్‌ఫోన్లలో మంచిగా మాట్లాడి నిలువునా ముంచుతారని.. సైబర్ నేరాలపై ఎవరు నిర్లక్ష్యంగా ఉండరాదని ఎస్సై శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ముస్తాబాద్ మండలం నామాపూర్‌లోని ప్రగతి భవన్‌లో మీకోసం సమావేశాన్నినిర్వహించి మాట్లాడారు.. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేస్తే స్పందించరాదని,వాట్సాప్‌కాల్స్‌తో అమ్మాయిలు మాట్లాడి బ్లాక్‌మెయిల్ చేస్తారన్నారు. గ్రామాల్లో అపరిచితులు సంచరించినా, ఏ సమస్య వచ్చినా సమాచారం ఇవ్వాలన్నారు.సర్పంచ్ విజయ, సింగిల్‌విండో కొండం రాజిరెడ్డి,రైతులు, ఆటో డ్రైవర్లు, యువకులు, పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న గౌతంరెడ్డి

కోనరావుపేట: ఉద్యానవన శాఖ ద్వారా పండ్లతోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జెడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీఆర్‌డీవో గౌతంరెడ్డి తెలిపారు. కోనరావుపేట ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ.. ఉద్యానవన శాఖ ద్వారా మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, సీతాఫలం, సపోట, జీడిపప్పు, మునగ, డ్రాగన్‌ఫ్రూట్, అల్లనేరేడు, ఆపిల్‌బేర్, దానిమ్మ తదితర తోటలు సాగుకు అవకాశం ఉందన్నారు. ఉపాధిహామీ జాబ్‌కార్డు ఉండి, ఐదేకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా 100 శాతం, ఇతరులకు 90 శాతం రాయితీ ఉంటుందన్నారు. అలాగే ప్రభుత్వం నూతనంగా అమలుచేస్తున్న గృహలక్ష్మి పథకానికి అర్హులైన నిరుపేదలు దరఖాస్తులు ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, ఎంపీడీవో రామకృష్ణ ఉన్నారు.

ఆశ వర్కర్లు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి గీతాంజలి

ముస్తాబాద్: ఆశవర్కర్లు బాధ్యతగా పనిచేసినప్పుడే పేదలకు ప్రభుత్వ వైద్యం అందుతుందని వైద్యాధికారి గీతాంజలి అన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశ డేను శనివారం నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ.. ఆశ వర్కర్ల కృషితోనే నేడు పల్లెల్లో పేదలకు వైద్యం అందుతోందన్నారు. ముఖ్యంగా సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ప్రసవానికి వచ్చే వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకువచ్చి, తిరిగి అదే రోజు అంబులెన్స్‌లో పంపించే విషయాలు తెలపాలన్నారు. ప్రజారోగ్యం కోసం ఆశవర్కర్లు నిరంతరం చేసే పనికి గుర్తింపు లభిస్తుందన్నారు. హెచ్ఈవో యాదగిరి, సీహెచ్‌వో తార, పీహెచ్ఎన్ జ్యోతి, హైలట్ కిషన్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

కోనరావుపేట: ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ విష్ణుకుమార్ అన్నారు. మండలంలోని పల్లిమక్తలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీమా, పెన్షన్ పథకాలపై అవగాహన కల్పించారు. సామాజిక భద్రత పథకాల్లో ప్రతి ఒక్కరు చేరాలని, పంట రుణాలను సద్వినియోగపర్చుకుని సకాలంలో చెల్లించాలన్నారు. సర్పంచ్ జిన్న అనిల్, లీడ్‌బ్యాంక్ కౌన్సిలర్ వెంకటరమణ, ఉపసర్పంచ్ మర్యాల కిషన్, మహిళలు పాల్గొన్నారు.

‘క్విట్ ఇండియా’ స్ఫూర్తిని రగిలిస్తాం

సిరిసిల్లటౌన్: కేంద్ర సర్కారు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ అన్నారు. ఈనెల 9,10 తేదీల్లో నిర్వహిస్తున్న ‘మహాపడావ్’ కార్యక్రమ పోస్టర్లను శనివారం స్థానిక బీవైనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాలో కార్మికలోకం పాల్గొనాలని కోరారు. రమేశ్, రమణ, అజయ్, అశోక్, శ్రీధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను నిషేధించాలి

సిరిసిల్లఅర్బన్: ప్లాస్టిక్ రహితం అంటూనే ఫ్లెక్సీలను వాడుతున్నారని ఫ్లెక్సీలను నిషేధించాలని తెలంగాణ పెయింటింగ్ చిత్రకారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు వెంగళ గణేశ్వర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామగ్రామాన గోడలపై పేయింటిగ్ వేయాలని సూచించిందన్నారు. కానీ గ్రామకార్యదర్శులు, తక్కువ ఖర్చులో ఫ్లెక్సీలు ముద్రించి ఏర్పాటుచేస్తున్నారన్నారు. దీంతో చిత్రకారుల జీవనోపాధికి కుంటుపడుతుందన్నారు. చిత్రకారుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మల్లేశ్, మధు, తిరుపతి ఉన్నారు.